# గానభిక్ష

సాహిత్యాభిమానం సంగీతాభిమానం వున్నవాళ్లు ఓ మూల కూర్చోలేరు. వాళ్లే ఏ వూళ్లో వున్నా ఏదో ఒక సాహిత్య సంస్థలోనో సంగీత సంస్థలోనో సభ్యత్వం తీసుకుని సదరు సంస్థ అభివృద్ధికి పాటుపడతారు. కనీసం పాటుపడదామనుకుంటారు. కొండొకచో కొంచెం స్వలాభమే లావు కావచ్చు.. అది వేరే.

అనగనగా ఓ చిన్న మునిసిపాలిటీలో కమీషనర్‌గా విచ్చేశారు సంగీత కళాభిమాని కనకచేలం గారు. ఓ పక్క, విధినిర్వహణలో లోటు రాకుండా చూసుకుంటూ, సంగీత కళాసంస్థ స్థాపించాలని నడుం బిగించారు. ఊళ్లో ఉన్న సంగీతప్రియుల్నీ, వర్తక ప్రముఖుల్నీ కలుసుకుని తన మనోగతాన్ని తెలియజేశారు. వారు తమ ఆర్థిక పరిమితులకు లోబడి సహకరిస్తానన్నారు. వెంటనే 'స్వరధుని' అనే సంస్థని నెలకొల్పి కార్యవర్గాన్ని ఏర్పాటు చేశారు. ముందు తన యిల్లు చక్కపెట్టుకోవాలనే అభిప్రాయంతో సంస్థ నెలకొల్పిన పదకొండు నెలలపాటు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వర్ధిష్ణువులైన చిన్నచిన్న కళాకారుల్ని పిలిపించి గాత్రం, వాయులీనం, వీణ, మృదంగం, సన్నాయి వంటి వాద్యాలతో కార్యక్రమాలు నిర్వహించారు.

ఇహ సంస్థ వార్షికోత్సవం నెలరోజులుందనగా, దేశవిదేశాల్లో ఖ్యాతిగన్న ఒక ప్రముఖ విద్వాంసుణ్ని ఆహ్వానించాలని కార్యవర్గం సంకల్పించింది. ఆ కళానిధిని సాదరంగా ఆహ్వానిస్తూ లేఖ వ్రాశారు కనకచేలంగారు. ఆ విద్వాంసుల స్థాయి చాలా పెద్దది. వారి స్థాయికి తగ్గట్టుగా, ఐదువేల రూపాయల ఫ్లయిట్ చార్జీలు, పదివేల రూపాయాలు పర్సు ప్రెజెంట్ చేస్తేకాని రాలేనన్నారు. కనకచేలంగారు తటపటాయించారు. సభ నిర్వహణకయ్యే ఖర్చు నేను భరిస్తానన్నారు. ఒక వర్తకప్రముఖుడు. ఫ్లయిట్ చార్జీ లివ్వడానికి నా వంతు ఐదువేలు అన్నాడింకో అభిమాని. అయితే అ విద్వాంసుని కివ్వడానికి నా వంతుపదివేలివిగో అన్నవాళ్లు ఒకళ్లూ లేరు. రెండు చేతులకూ వున్న పదివేళ్లతోనూ పదివేల నమస్కారాలు

ఇవ్వగలం కాని పదివేల రూపాయలు మాత్రం ఇవ్వలేం-అన్నవాళ్లు ఎక్కువయ్యారు ఆ పురప్రజల్లో. కమీషనర్ కనకచేలంగారు తీవ్రమైన మనస్తాపానికి గురి అయ్యారు. ఎలాగైనా ఆ ఉన్నతస్థాయి సంగీత కళానిధిచే కచ్చేరి చేయించాలనే తపన ఎక్కువైంది ఆయనలో.

తన భార్యామణి అనుమతితో ఆమె బంగారాన్ని బ్యాంకులో తాకట్టుపెట్టి, పదివేలు అప్పుతెచ్చి, ఆ సంగీత కళానిధిగారి పేర డ్రాఫ్ట్ తీసివుంచారు కనకచేలంగారు. ఒక అభిమాని ఇస్తానన్న అయిదువేల రూపాయల్ని తీసికొని ఫ్లయిట్ చార్జీల క్రింద డి.డి. పంపించారు. అనుకున్న రోజుని కచ్చేరి ప్రారంభమైంది. లాంచనంగా 'వాతాపి గణపతిం భజే' కీర్తనని హంసద్వని రాగంలో ఆలాపించి,రకరకాల త్యాగరాజు కీర్తనలు, జయదేవుని అష్టపదులు, నారాయణ తీర్థులవారి తరంగాలు,కూచిపూడి సిద్ధేంద్రయోగి, భద్రాచల రామదాసుల కీర్తనలు ఆ గాయకశిఖామణి గానంచేసి ప్రేక్షకుల్ని మంత్రముగ్ధుల్ని గావించారు.కొన్ని కీర్తనలు పూర్తి అయ్యాక మధ్యలో ఆపి, ఓ పది నిముషాలు పాటు సంగీత కళానిధిగారి గానామృతాన్ని గురించి ఆ పురపాలక సంఘం ప్రధమపౌరుని చేత నాలుగు ప్రశంసావాక్యాలు చెప్పించి వీడియో కెమెరాల మధ్య శాలువ కప్పించి, కవరులో పదివేల రూపాయల డ్రాఫ్టను పదిలంగా పెట్టి ఘనంగా వారిని సత్కరించారు. సమ్మాన కార్యక్రమం ముగిశాక నిధి చాల సుఖమా? రాముని సన్నిధి చాలసుఖమా? అన్న త్యాగరాజకృతిని కల్యాణిలో గానం చేసారు. కళానిధి మహోదయులు. ఇప్పుడు, ఈ సంగీత సభానిర్వాహకులు చాలా మథనపడ్డారు.

'అయ్యో! మహానుభావుడు,మహాభక్తుడు అయిన త్యాగ రాజు-తన ఆస్థాన విద్వాంసునిగా విరాజిల్ల మని కోరిన తంజావూరు నేలిన ఏలిక, రెండవ శరభోజి మహోదయుల ఆహ్వానాన్ని తిరస్కరించి 'నిధి చాల సుఖమా ? రాముని సన్నిధి చాల సుఖమా?' అనే కీర్తన వ్రాసి తన ఉచ్ఛ్వాస నిశ్వాసలలో రామనామం జపిస్తూ, తనదైన భిక్షాటన వృత్తినే కొనసాగిస్తూ కాలం వెళ్ళబుచ్చారే? అటువంటిది ఈనాడు ఆ భిక్షుకుడైన త్యాగరాజు కీర్తనలనే గానం చేస్తూ ఫలానా ఇంత పారితోషికం ఇస్తేనేకాని కచ్చేరి చేయనని, ధన సంపాదన పరులై ఆకాశహర్మ్యాలు నిర్మించుకొని, ఏసి గదుల్లో జీవిస్తూ ఫ్లయిట్ చార్జీలు ఇస్తేనే కాని రాలేననే సంగీత సమ్రాట్టులు, కళానిధులు తయారయారే! ఏ కళాకారుడైనా తన 'జీవిక ' కోసం సంగీతపాఠాలు చెప్పుకుని కచ్చేరిలు చేయడంలో తప్పులేదు కానీ భిక్షాటనం చేసుకొని జీవించి, తన తర్వాతి తరాల సంగీత విద్వాంసులకు 'భిక్ష' పెట్టిన ఆ త్యాగరాజస్వామి కీర్తనలనే గానం చేస్తూ సొమ్ము చేసుకోవడం - పైగా 'నిధి చాల సుఖమా? రాముని సన్నిధి చాల సుఖమా? అని గానం చేయడం హాస్యాస్పదం కాదా? అందుకే ఆరుద్ర అన్నాడు -" అందరూ మహానుభావులే! ఎందరికి వందనాలు?" అని.

22-12-2002

ఆదివారం ఆంధ్రప్రభ